క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమరావతి: మహాశివరాత్రి సందర్భంగా మరమ్మతులు చేయుటకు మండల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని ఆయన కోరారు.

పెదకూరపాడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు బెల్లంకొండ మండలం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 33 కేవీ, 11 కేవీ ఎల్‌టీ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. బెల్లంకొండ, పాపాయపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుద్యోగ యువతకు కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు నిరుద్యోగులకు శిక్షణ బెంగళూరులో ఇవ్వబడుతుందని, వివరాలకు 9000487423 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

భారతి సిమెంట్‌చే భవన నిర్మాణ కార్మికులకు, మేస్త్రీలకు బీమా



క్రోసూరు: భారతి సిమెంట్ కంపెనీ భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు లక్ష రూపాయల బీమా కల్పించే కార్యక్రమం గురువారం సాయంత్రం చేపట్టింది. క్రోసూరులో గురువారం సాయంత్రం కంపెనీ సేల్స్ మేనేజర్ జయరామిరెడ్డి, టెక్నికల్ అధికారి శంకర్ ఆధ్వర్యంలో సిమెంట్ డీలర్ ములకా గంగాధర్‌రెడ్డి ఇంటి వద్ద భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయరామిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి తయారు చేసిన నాణ్యమైన సిమెంట్ భారతి సిమెంట్‌ను భవన నిర్మాణాలకు ఎంచుకోవాలని కోరారు. భారతి సిమెంట్‌తో స్లాబ్ వేస్తే తమ కంపెనీ ప్రతినిధులు ఏడు రోజులలో వచ్చి నాణ్యత పరిశీలించటం జరుగుతుందన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు లక్ష రూపాయల బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. ములకా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ యూనిట్ ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పోసిపోగు వెంకటరావు, సంయుక్త కార్యదర్శి యుగంధర్, సుశీల, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పంతులునాయక్, వేణుగోపాల్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ వరకు సాగునీరు అందించాలి

పెదకూరపాడు: నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని అమరావతి మేజర్‌కు ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక (పీడీఎఫ్) కన్వీనర్ దర్శి శేషారావు కోరారు. శుక్రవారం పెదకూరపాడు తహసీల్దార్ ధనలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మేజర్, మైనర్ కాలువల కింద మిరప, పొగాకు, మొక్కజొన్న, జొన్న, ఇతర పంటలు సాగు చేయటం జరిగిందన్నారు. ఆ పంటలకు నీరు నిరంతరాయంగా ఇవ్వాలని లేనిచో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. కాలువలకు నాచు తొలగించి నీరు అందిస్తున్నందుకు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌కు, మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమల్ల రమేష్‌కు, డీసీ చైర్మన్ వి.అప్పారావుకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఎం.మస్తాన్‌రావు, బి.రవికిరణ్, ఎం.నరసింహారావు, వై.నరేంద్ర, వి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాగులో మృతదేహం లభ్యం

అచ్చంపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని వాగులో శుక్రవారం వ్యక్తి మృత్తదేహాన్ని స్థానికుల ద్వారా పోలీసులు గుర్తించారు. అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం వాగులో లభ్యమైన మృతదేహం స్థానిక బీసీ కాలనీకి చెందిన నల్లూరి ఆంజనేయులు(60)గా గుర్తించామన్నారు. ఇతన 20 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భార్య నల్లూరి అంజమ్మ శుక్రవారం ఫిర్యాదు చేసిందన్నారు. మృతదేహంపై సుమారు 10 రోజుల క్రితం మృతి చెందిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. స్థానికులు ఫిర్యాదుతో సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ద్వారా ఆంజనేయులుదిగా గుర్తించామన్నారు. పోస్టుమర్టం నిమిత్తం సత్తెనపల్లి తరలించనున్నట్లు తెలిపారు.

నిధులు ఫుల్.. యూనిట్లు నిల్

- సమాఖ్యల సమావేశాలు సైతం కరవు
- ఇష్టానుసారం సభ్యుల తొలగింపు, ఎంపికలు
- రుణాల మంజూరులో రూ.లక్షకు రూ.వెయ్యి వసూలు

మెప్మాలో వారు ఆడిందే ఆట..!



సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం

సత్తెనపల్లి: పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో అడిగే వారు లేక ఇష్టారాజ్యంగా జరుగుతోంది. ఓ మహిళ రుణం గురించి అడిగేందుకు మున్సిపల్ కార్యాలయానికి శుక్రవారం వచ్చింది. టీఎంసీ అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ మేనేజర్ సాంబశివరావుతో జరిగిన విషయం చెప్పగా ఆయన టీఎంసీ మహమ్మద్ ఖాజాకు ఫోన్ చేశాడు. చెప్పేది వినకుండా అధికారి అని చూడకుండా దురుసుగా మాట్లాడుతూ.. మీరు హామీ ఉంటే రుణం ఇప్పిస్తానంటూ మేనేజర్‌తోనే గొడవపడటం జరిగింది. ఇలాంటి ఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయి. రాజకీయ అండతో మెప్మా సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా జరుగుతోంది. స్వయం సహాయక సంఘాలతో సమన్వయం కుదరక మరిన్ని గొడవలు జరుగుతున్నాయి. మెప్మా విభాగంలో ఎవరు ఎప్పుడు వస్తారో.. వెళతారో తెలియని పరిస్థితి.

యూనిట్లు నెలకొల్పకుండా...

పట్టణంలో 1,094 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో పది మంది సభ్యులు ఉంటారు. మెప్మా విభాగంలో ఒక టీఎంసీ, ఇరువురు సీఓలు, 32 మంది ఆర్పీలు ఉన్నారు. మెప్మా ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి 349 స్వయం సహాయక సంఘాలకు రూ.52.70 కోట్లు బ్యాంక్ లింకేజి పథకం కింద మంజూరయ్యాయి. కొన్ని సంఘాలు బాగా నడుస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండగా ఎక్కువ సంఘాల్లో యూనిట్లు ఏర్పాటు చేయకుండా నిధులు తీసుకోవడం.. చెల్లించటం జరుగుతోంది. తనిఖీల సమయంలో గత యూనిట్లనే చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్భాటంగా సంఘాల బోర్డులు తయారు చేయటం మూలన పడేయటం పరిపాటిగా మారిందనే విమర్శలు ఉన్నాయి.

తూతూ మంత్రంగా సమావేశాలు

బ్యాంకు రుణాల మంజూరులో సీఓలు చూపుతున్న శ్రద్ధ రికవరీలో చూపడం లేదని బ్యాంకర్లు ఆరోపిస్తుంటారు. సమాఖ్యల సమావేశాలు కూడా తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. వాటిని పర్యవేక్షించాల్సిన సీఓలు, ఆర్పీలు కూడా పట్టించుకోవడం లేదు. రుణాలు తీసుకునే సమయంలో మాత్రమే నామమాత్రంగా సంతకాలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని కొందరు మహిళలు ఆర్పీలుగా చలామణీ అవుతున్నారు. బుక్ కీపింగ్‌తోపాటు ఆయా మహిళా సంఘాలకు అధ్యక్షులుగా కూడా వారే త్రిపాత్రాభినయం చేస్తున్నారు. పలు సంఘాల రిజిస్టర్లు ఆర్పీల వద్ద, బ్యాంకు పుస్తకాలు సీవోల వద్ద ఉంటున్నాయి.

అధికమైన అవినీతి

మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేసే సమయంలో రూ.లక్షకు రూ.వెయ్యి చొప్పున సీఓలు, ఆర్పీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల మంజూరు చేసిన పెట్టుబడి నిధిని మహిళలు యూనిట్ల ఏర్పాటుకు వినియోగించాలని ప్రభుత్వం చెబుతుంటే ఆ నిధులను కొందరు సీఓలు, ఆర్పీలు సంఘ సభ్యులచే డ్రా చేయించి మామూలు తీసుకుంటున్నట్లు సమాచారం. బ్యాంకుల్లోని పొదుపును కూడా ఇష్టారాజ్యంగా డ్రా చేసి పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సంఘ సభ్యుల తీర్మానాలు లేకుండా బ్యాంకుల్లోని నిధులను వారి స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఈ విషయంపై పలు దఫాలు సభ దృష్టికి తెచ్చారు. కౌన్సిల్ సభ్యుల సిఫార్సులకు వ్యతిరేకంగా మెప్మా సిబ్బంది ఇష్టం వచ్చిన వారికి రుణాలు మంజూరు చేయడం, చేతివాటం ప్రదర్శించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాయితీలు లభించడం లేదు

మహిళా స్వయం సహాయక సంఘాల్లో సక్రమంగా రుణాలు చెల్లించడం లేదనే నెపంతో కొందరు అధ్యక్ష, కార్యదర్శులకు ఇష్టం లేని వాళ్లను ఇష్టానుసారంగా తొలగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. తొలగించే సమయంలో సీవో, ఆర్పీలు ధ్రువీకరించాల్సి ఉంది. కానీ అలాంటిదేమీ లేకుండా చేస్తున్నారు. తొలగింపు సమయంలో వారికి మంజూరైన ప్రభుత్వ రాయితీలు ఇవ్వడం లేదు. వారి స్థానంలో చేర్చుకున్న కొత్త సభ్యులకు కూడా రాయితీలు లభించడం లేదు.

వసూళ్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు



స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ నుంచి మెప్మా సిబ్బంది వసూళ్లకు పాల్పడ్డట్లు సభ్యులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ మేనేజర్‌తో మెప్మా టీఎంసీ ఫోన్‌లో దురుసుగా మాట్లాడినట్లు నా దృష్టికి వచ్చింది. ఇష్టానుసారంగా వ్యవహరించే వారిపై మెప్మా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాఖాపరమైన చర్యలు చేపడతాం.

–కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి

ఉపాధి కల్పించాలి

పట్టణంలో ప్రతి సమావేశానికి సంఘాల సభ్యులనే రప్పిస్తుండడంతో నాయకులు కూడా వారి పనితీరుపై దృష్టి సారించడం లేదు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు మెప్మా విభాగంలోని అవినీతిని ప్రక్షాళన చేసి సంఘాలను బలోపేతం చేయడంతో పాటు యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కల్పించాలని, మహిళా సాధికారతను సాధించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహించినా, సిట్టింగ్‌లు పెట్టినా చర్యలు



క్రోసూరు: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో ఎక్కడైనా అనధికారికంగా మద్యం షాపులు నిర్వహించినా, లైసెన్సు షాపుదారుల నేతృత్వంలో సిట్టింగ్‌లు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ టి.తులసి హెచ్చరించారు. శుక్రవారం ఎక్సైజ్ పరిధిలోని అన్ని లైసెన్సు దుకాణాలను తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు. షాపుల ఎదుట ఎమ్మార్పీ బోర్డులు లేకున్నా, సిట్టింగ్‌లు ఏర్పాటు ఉంటే వాటిని తొలగించి నిర్వాహకులను హెచ్చరించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయాలు చేసుకోవాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లైసెన్సు దారులను హెచ్చరించారు.

తూనికల శాఖ అధికారులు వచ్చారు.. వెళ్లారు

క్రోసూరు: సత్తెనపల్లి తూనికల శాఖ అధికారులు గురువారం క్రోసూరుకు వచ్చారు. అదే విధంగా శుక్రవారం క్రోసూరు మీదగా అచ్చంపేట మండలం వెళ్లారు. కానీ ఏం జరిగింది, ఎక్కడ తనిఖీలు చేశారు.. కేసులు పెట్టారా.. లేదా అనే సమాచారం మాత్రం చెప్పలేదు. ఫోనులకు కూడా అధికారులు స్పందించటం లేదు. పైగా సాయంత్రం సమయాల్లో తనిఖీలు చేసేందుకు రావటంలో అర్థమేమిటోనని ప్రజలు సందేహం వ్యక్తపరుస్తున్నారు. తూనికల అధికారులు వచ్చినపుడు దుకాణాలన్నీ మూతపడటంతో మాత్రమే ప్రజలకు తూనికల అధికారులు వచ్చారన్న విషయం తెలిసింది. కానీ అధికారులు ఏం చేసారనేది తెలియరాలేదు.

నులి పురుగుల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



పెదకూరపాడులో గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న అధికారులు

పెదకూరపాడు : నులిపురుగుల నివారణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని 19 సంవత్సరాల లోపు పిల్లలకు అందించాలని ఎంపీడీవో రామకృష్ణ, 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెలుగొండ రెడ్డి అన్నారు. పెదకూరపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఈ నెల 10వ తేదీన నిర్వహించే నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 19 సంవత్సరాల లోపు పిల్లలు 8,120 మంది ఉన్నారని, వారికి ఈ నెల 10న మధ్యాహ్న భోజనం అనంతరం నులి పురుగుల నివారణ మాత్రలు మింగించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మాత్రలు అందజేశారు. సత్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ మున్ని, వైద్య సిబ్బంది విజయ్ కుమార్, దిలీప్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

క్రోసూరు: ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం జయప్రదం చేయాలని పీహెచ్‌సీ వైద్యులు శుక్రవారం వైద్య ఆరోగ్య కార్యకర్తలను, ఆశలను, అంగన్‌వాడీ వర్కర్లను కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ షాద్, డాక్టర్ సిరిచందన మాట్లాడుతూ 1–19 సంవత్సరాల మధ్య వయసు గల బాల బాలికలు అందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ నులి పురుగుల నుంచి రక్షణకు ప్రతి ఒక్కరు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

నులి పురుగుల నిర్మూలనపై అవగాహన

ముప్పాళ్ళ: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10వ తేదీన 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని పీహెచ్‌సీ వైద్యురాలు పీ రమాదేవి చెప్పారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోను ఉన్న పిల్లలందరి చేత మాత్రలు మింగించాలన్నారు. ఈ మాత్రల ద్వారా పోషకాహార లోపం, రక్తహీనత నుంచి బయట పడవచ్చన్నారు. సూపర్‌వైజర్లు పీటర్‌డేమియన్, ఎం.జోస్ఫిన్‌రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆల్బెండజోల్ మాత్రలను చూపిస్తున్న మండల పీహెచ్‌సీ వైద్యులు



ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న ఎంఈవో, డాక్టర్ తదితరులు

కార్యక్రమం విజయవంతం చేయాలి

రాజుపాలెం: ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ రెండేళ్ల నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నులి పురుగులను నివారించవచ్చని తెలిపారు. మండలంలో 8,850 మంది పిల్లలు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి బి.మల్లిఖార్జునశర్మ, హెచ్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆల్‌బెండజోల్‌తో నులి పురుగుల నుంచి రక్షణ

సత్తెనపల్లి: ఆల్‌బెండజోల్ మాత్రలతో నులి పురుగులను నివారించవచ్చని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగేటట్లు చూడాలన్నారు. ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఈ మాత్రలను ఇస్తున్నట్లు చెప్పారు. పణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసున్న పిల్లలందరిలో నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయాలన్నారు. 12,500 మంది విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ముందుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంఈఓ–1 ఏ శ్రీనివాసరావు, ఎంఈఓ–2 ఏ రాఘవేంద్రరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు అందరూ సహకరించాలి

అచ్చంపేట: నులిపురుగులను సంపూర్ణంగా నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నులిపురుగులను నివారించేందుకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ నెల 10న ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలచేత మింగించడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విరాంబాబునాయక్ మాట్లాడుతూ నులి పురుగులు రక్తహీనతను కలుగజేస్తాయన్నారు. మండలంలో 12,337 మంది పిల్లలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పంతులునాయక్, సూపర్‌వైజర్ మాణిక్యమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రాధాకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.

ల్యాప్ టాప్, సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్, ల్యాప్ టాప్‌ను అప్పగిస్తున్న పోలీసులు

లక్ష్మీపురం: రైలులో చోరీకి గురైన ల్యాప్ టాప్, సెల్ ఫోన్, పర్సును బాధితురాలికి జీఆర్పీ పోలీసులు అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జీఆరీప పోలీసులు తెలిపిన వివరాలు.. అమరావతి మండలం అత్తలూరుకు చెందిన కొండవీటి బాలసుష్మ, వైజాగ్‌లో ఇంజినీరింగ్ చేస్తోంది. స్వగ్రామంలో శుభాకార్యం ఉండటంతో వైజాగ్ నుంచి గుంటూరుకు రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ క్లాస్‌లో రిజర్వేషన్ చేయించుకుని వస్తోంది. శుక్రవారం తెల్లవారు జామున యువతి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, పర్సును సీటులో పెట్టి వాష్‌రూమ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చే సరికి సీటులో ఉన్న సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, పర్సు కనిపించలేదు. దీంతో బోగిలో వెతుకలాడి తక్షణమే జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో, గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై వెతుకలాడటం ప్రారంభించారు. అయితే గుంటూరు రైల్వే స్టేషన్‌లో 6,7 ప్లాట్‌ఫాంల మధ్య అండర్ గ్రౌండ్ మెట్ల వద్ద పోలీసులను చూసి చోరీకి పాల్పడిన వ్యక్తి పరారయ్యాడు. దీంతో బాధితురాలికి సొమ్మును అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి కోసం సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

విద్యార్థుల విజయం తల్లిదండ్రులకు రిటర్న్ గిఫ్ట్

ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, ఎంఈఓ బాలసుందర్‌రావు

పెదకూరపాడు : విద్యార్థులు సాధించే విజయం తల్లిదండ్రులకు ఒక రిటర్న్ గిఫ్ట్‌గా ఉండాలని ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ మండలం ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షల పైన అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఎలా చదవాలో సూచనలు.. భయం పోవడానికి తీసుకోవాల్సిన చిట్కాలు వివరించారు. పరీక్షల సమయంలో నిద్ర, తిండి ముఖ్యం అన్నారు. మండల విద్యా శాఖ అధికారి బాలసుందర్‌రావు హేమాద్రి ఆయుర్వేద ఫార్మసీ ఇచ్చిన బ్రైనోవిటా, ఆయుష్ మందులను, వ్యాధి నిరోధక శక్తి పెంచడానికి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పెద్దబాబు శ్రీనివాస్, ఉషారాణి, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది వెంకటరామయ్య, సునీత, సుశీల, యోగా టీచర్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్ తదితరులు

సత్తెనపల్లి: మంచి నడవడిక, విలువలతో కూడిన విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ విజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్, టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మాత రమాబాయి అంబేడ్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ వెనక తన శ్రీమతి రమాబాయి అంబేడ్కర్ త్యాగం ఎంతో ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి, మద్యం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి మాట్లాడుతూ స్త్రీ తల్లిగా, చెల్లిగా, అక్కగా, భార్యగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు మాట్లాడారు. ప్రిన్సిపాల్ జాన్సన్ అధ్యక్షత వహించగా ముందుగా మాత రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు, టీచర్ మస్తాన్ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీకి పాల్పడడం చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ప్యానల్ న్యాయవాది శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వెట్టి చాకిరీకి పాల్పడితే చట్టరీత్యా నేరమని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో వెట్టి చాకిరీ నిర్మూలనపై పట్టణంలోని 15వ సచివాలయంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ మన ప్రాంతంలో ఎవరైనా వెట్టి చాకిరీ చేయిస్తున్న యజమానుల వివరాలు మండల న్యాయ సేవాధికార కమిటీ వారికి గానీ, సత్తెనపల్లి కార్మిక శాఖకు గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన చేయాలన్నారు. అంతేకాకుండా చట్టం అనుమతించిన మేరకు వేతనాలు ఇవ్వాలని, నిర్ణయించిన పని గంటల మేరకు మాత్రమే పని చేయించాలన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ముబారక్, షేక్ ఖాజా, మహిళలు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపుతున్న మత్స్య శాఖ



చేపపిల్లలను నదిలో వదులుతున్న అధికారులు

పెదకూరపాడు: మత్స్యకార కుటుంబాల జీవనోపాధి మెరుగుపరుచి వారి జీవితాల్లో వెలుగు నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా మత్స్య శాఖ అధికారి ఎస్.సంజీవరావు పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ మండలంలోని బోదనుం రేవులో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచే దిశగా మత్స్య శాఖలోని ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా 10 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, నది లైసెన్స్ హోల్డర్లు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మత్స్య శాఖ అధికారి పర్యవేక్షణలో సీడ్ స్టాకింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి ఎస్.సంజీవరావు, మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య, మాచర్ల, సత్తెనపల్లి మత్స్య శాఖ సహాయ పర్యవేక్షకులు టీపీఏ శ్రీనివాసరావు, జి.భాగ్యలత, తహసీల్దారు అశ్రఫున్నీసా బేగం, ఎంపీడీవో వైహనిమి రెడ్డి, గ్రామ మత్స్య సహాయకులు వై.పావని, ఎస్.రమేష్, సిబ్బంది, లైసెన్స్ హోల్డర్ ఏలూరి బ్రహ్మయ్య, నాగిరెడ్డిపాలెం సర్పంచ్, ఆర్–ఆర్ సెంటర్ న్యూచిట్యాల సర్పంచ్, మన్నెసుల్తాన్ పాలెం సర్పంచ్ పాల్గొన్నారు.

అధికారుల అనుమతితోనే కొట్టివేత..?

ముప్పాళ్ళ: పెదనందిపాడు బ్రాంచి కాలువ కట్టపై చెట్లు మాయంలో ఎన్నెస్పీ అధికారులే కీలకంగా మారారు. వారి అనుమతితోనే చెట్లు నరికి అమ్మకాలు జరుపుతున్నారని పోలీసుల విచారణలో తేలింది. రెండు రోజుల నుంచి పత్రికల్లో వస్తున్న కథనాలపై దృష్టి పెట్టిన పోలీసులు విచారణ చేపట్టారు. దుంగలను తరలిస్తున్న వ్యక్తిని విచారిస్తే ఎన్నెస్పీ అధికారులు అనుమతి ఇస్తేనే కొట్టామని చెప్పినట్లు సమాచారం. అయితే ఎన్నెస్పీ అధికారులు మాత్రం తమకు తెలియకుండా ముప్పాళ్ళకు చెందిన వ్యక్తి చెట్లు కొట్టాడని, తెలియగానే వాటిని స్వాధీనం చేసుకొని అదే రోజు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెబుతున్నారు. పోలీసులు మాత్రం ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు. రెండు శాఖల మధ్య పొంతన లేని సమాధానం రావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వివాదం జరిగితేనే స్పందించి కేసు నమోదు చేసే పోలీసు శాఖ ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా చెట్లను నరికి తరలిస్తున్నారని ప్రభుత్వ అధికారి ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహారాన్ని సద్దుమణిగించే ప్రయత్నాలు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఎవరిది ఎంత పాత్రో ఉన్నతాధికారులు చొరవ చూపితే తప్ప వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదు.